ప్రభుత్వ క్వార్టర్స్.. ప్రైవేట్ పరం

- అద్దె చెల్లించకుండా నివసిస్తున్న బయటి వ్యక్తులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కూల్చివేసి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామంటున్న అధికారులు



పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్



ఆక్రమణలో ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్

డోన్: ప్రభుత్వ ఉద్యోగుల కోసం బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారు. అధికారుల ఉదాసీనత వైఖరితో క్వార్టర్స్ నిరభ్యంతరంగా కాపురం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు నయాపైసా జమ చేయకుండానే దర్జాగా నివాసం ఏర్పరుచుకున్నారు. 1915 మార్చి 28న అప్పటి బ్రిటీష్ పాలకులు డబ్ల్యూ వెర్నన్ నిర్మించినట్లు శిలాఫలకాల ద్వారా తెలుస్తోంది. వందేళ్లు దాటినా నిర్మాణాలు నేటికీ చెక్కుచెదర లేదు. వీటి ముందు రెవెన్యూ, సబ్‌ట్రెజరీ, కోర్టు, సబ్‌జైలు, పోలీసుస్టేషన్‌లను కూడా అప్పట్లో నిర్మించారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగుల కోసం 22 నాల్గవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్, 18 రెవెన్యూ క్వార్టర్స్‌ను నిర్మించారు. ఇందులో ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం కోసం 3 క్వార్టర్స్‌ను తొలగించి నూతన భవనాలు నిర్మిస్తున్నారు.

దర్జాగా నివాసం..

నాల్గవ తరగతి, రెవెన్యూ అధికారుల కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో పలు వాహనాల యజమానులు, వ్యాపారులతో పాటు బయటి వ్యక్తులు తిష్టవేసి ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. అధికారుల అనుమతులు లేకుండానే స్వల్ప మరమ్మతులు వారే చేయించుకొని కాపురముంటున్నారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగి కూడా వీటిలో నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా, ఖాళీగా ఉండటంతో బయటి వ్యక్తులు క్వార్టర్స్‌ను ఆక్రమించుకున్నారు. అలాగే నివాసముంటున్నందుకు ప్రభుత్వానికి అద్దె కూడా చెల్లించడం లేదు. దీంతో ఆదాయానికి గండి పడుతుండటమే కాకుండా ఆక్రమణ గురయ్యాయి. కాగా..రెవెన్యూ అధికారులు పలుమార్లు క్వార్టర్స్ ఖాళీ చేయాలని నివాసముంటున్న వారిని హెచ్చరించినా వారు ఏమాత్రం ఖాతరు చేయకపోవడం విశేషం. ఈ క్వార్టర్స్ అన్నింటినీ కూల్చివేసి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలని అధికారులు పేర్కొంటున్నారు. తూనికలు, కొలతలు, మైన్ ఇరిగేషన్, విజయ డెయిరీ లాంటి శాఖల కార్యాలయాలు ప్రస్తుతం పట్టణంలోని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు ఏటా లక్షలాది రూపాయలను అద్దె రూపంలో ప్రైవేటు వ్యక్తులకు చెల్లిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇక్కడ నూతన భవనాలను నిర్మిస్తే పరిపాలన కూడా సౌలభ్యంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఇక్కడ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

క్వార్టర్స్‌ను కూల్చి వేసి కార్యాలయాలు నిర్మిస్తాం



భవిష్యత్‌లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆలోచన మేరకు ఇప్పటికే మూడు క్వార్టర్స్‌ను కూల్చివేసి రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇప్పటికే నిర్మిస్తున్నాం. మున్ముందు మరిన్ని ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాలకు స్థలం అవసరమవుతుంది. ఇందుకు ఈ క్వార్టర్స్ స్థలం అనువుగా ఉంటుంది.

– విద్యాసాగర్, తహసీల్దార్, డోన్

క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్య సేవలు



మంచానికే పరిమితమైన రోగిని ఇంటి వద్దే పరీక్షిస్తున్న వైద్యులు

ప్యాపిలి: రోగులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని వైద్యాధికారిణి వాణిశ్రీ తెలిపారు. మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది పర్యటించారు. ఆమె మాట్లాడుతూ జనరల్ ఓపీతో పాటు బీపీ, షుగర్ వంటి సమస్యలు, పక్షవాతంతో మంచానికే పరిమితమైన, గర్భిణులకు ఇళ్ల వద్దే వెళ్లి వైద్య పరీక్షలు చేశామని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, సిబ్బంది యశోద, లక్ష్మీదేవి, రంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

డోన్ టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, తల్లిదండ్రులతో హెచ్ఎం పద్మావతి సమీక్ష సమావేశం నిర్వహించారు.స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫెయిల్ అయిన విద్యార్థులు మానసికంగా కుంగిపోకుండా వారికి ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. వారిని మళ్లీ పరీక్షలు రాయడానికి సన్నద్ధం చేయాలని, ఇందుకోసం పాఠశాలల్లో నేటి నుంచి రెమీడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రెండు సబ్జెక్టులు ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ

సంజామల(కోవెలకుంట్ల): మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్‌రెడ్డి కుటుంబాన్ని సోమవారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. సూర్యప్రకాష్‌రెడ్డి తండ్రి గుండం ఈశ్వరరెడ్డి అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి తదితరులు గుండం కుటుంబాన్ని పరామర్శించారు.

రుణ విముక్తి చట్టం వర్తింపజేయాలి

డోన్ టౌన్: కేరళ రాష్ట్రం తరహాలో రాష్ట్రంలోని రైతులకు రుణ విముక్తి చట్టాన్ని ప్రవేశ పెట్టి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక సుబ్బారాయుడు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం సంఘం మండల అధ్యక్షుడు నాగ మద్దయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పూర్తి సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు అందించాలని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు స్వామినాథన్ కమిషన్ ఆదేశాల మేరకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం కలిపి చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రామాంజనేయులు, రామనాయుడు, సర్వేశ్వరయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసు విచారణ



బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన మేకల నాగరాజు భార్య సీతమ్మను ఇంటి స్థలం విషయంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన షమీమ్, గఫార్, హరుణ్ గొడవ పెట్టుకొని కులం పేరుతో దూషించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈనెల 3న ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. సోమవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి బేతంచెర్లకు వచ్చి కేసుకు సంబంధించి ఇరువర్గాల వారిని విచారించారు. సీఐ ప్రియతం రెడ్డి ఉన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

బేతంచెర్ల: ఈనెల 10వ తేదీన జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు మండల కేంద్రంలో 460 మంది విద్యార్థులు రాయనున్నారని పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్డీ రాజేష్ సోమవారం తెలిపారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో 300 మంది, సెంట్ ఆన్స్ ఉన్నత పాఠశాల్లో 160 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 10 గంటల లోపు విద్యార్థులు పరీక్ష కేంద్రం చేరుకోవాలన్నారు. విద్యార్థులు ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్, హెచ్‌బీ లేదా డబుల్ బ్లాక్ పెన్సిల్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

రథోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

అవుకు: ఈ నెల 9వ,10వ తేదీల్లో శ్రీ భూదేవి, లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో నిర్వహించనున్న రథోత్సవ కార్యక్రమానికి రైతుసంఘం, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పగడ్బందీగా చేపడుతున్నారు. రథోత్సవ సమయంలో విద్యుత్ తీగల వల్ల ఎలాంటి అవరోధాలు జరుగకుండా ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. తేరువీధి నుంచి ప్రధాన రహదారి అయిన రాజావీధి, మండపం వీధి వరకు రోడ్డుకు అటు ఇటు ఉన్న కరెంటు స్తంభాలను ఎక్కి సర్వీస్ వైర్లను పైకి లాగి అమర్చారు.

నేడు బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండలంలోని మెట్టుపల్లె గ్రామంలో మంగళవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు, గంగమ్మ జాతర సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా.. రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు.

గ్రామ సచివాలయాల్లో రోజూ స్పందన

బేతంచెర్ల: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాలో ఎంపికైనవారితో ప్రజాప్రతినిధులు, అధికారులు

డోన్:విద్యావంతులైన నిరుద్యోగులు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని రాణించాలని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రాయపురెడ్డి హాజరయ్యారు. రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పట్టణంలో మూడు చోట్ల ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మహిళలకు కుట్టుశిక్షణ, విద్యావంతులైన యువతీ యువకులకు అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ రంగాల్లో శిక్షణ ఇచ్చి కార్పొరేట్ సంస్థలలో ఉపాధి చూపుతారన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందిన వాకి సామ్‌సంగ్, ఎల్‌జీ, కియా మోటార్స్, వెంకటేశ్వర ఎలక్ట్రికల్స్‌లతో పాటు మరో 12 కంపెనీలు జాబ్‌మేళాకు హాజరై 30 మందిని ఎంపిక చేసుకున్నారని చెప్పారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం



డోన్ - తాడిపత్రి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి కొచ్చెర్వు, బావిపల్లె, చంద్రపల్లె, యాడికిల మీదుగా అనంతపురం జిల్లా తాడిపత్రికి నూతన బస్సు సర్వీసును సోమవారం చంద్రపల్లె సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరయ్యారు. చంద్రపల్లె నుంచి పీఆర్ పల్లె వరకు వేసిన రోడ్డుపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు డోన్ నుంచి తాడిపత్రి వరకు బస్సు సర్వీసును నడపాలని కోరారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ ఉన్నతాధికారులతో పాటు డీఎం శశిభూషణ్‌తో మాట్లాడి నూతన బస్సుసర్వీసును ఏర్పాటు చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల తరుపున మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాయలసీమ యూనివర్సిటీ క్లస్టర్ ఈసీ మెంబర్ న్యాయవాది నాగభూషణంరెడ్డి, నాయకులు సిద్దన గట్టు చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మంత్రి పీఏ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం భవనంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వార అమలువుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చూడాలని కోరారు. జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి, ఈఓఆర్డీ వరప్రసాద్ ఎంఈఓ ప్రభాకర్, హౌసింగ్ డీఈ నాగభూషణం, ఆర్‌డబ్ల్యూఎస్,పంచాయితీ రాజ్ ఏఈలు సతీష్,మనోహర్, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం



చురుగ్గా సాగుతున్న ఫోర్ లేన్స్ రోడ్డు పనులు

బనగానపల్లె: పట్టణంలో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు కొద్ది రోజుల్లో శాశ్వత పరిష్కారం లభించనుంది. ట్రాఫిక్‌తో పాటు పట్టణ ప్రజల సౌకర్యార్థం జీఎం టాకీస్ కూడలి నుంచి ప్రభుత్వ అతిథి గృహం వరకు నాలుగు వరసల రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో రూ.8కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ అతిథి గృహం నుంచి పోలీసు స్టేషన్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాగా, ప్రస్తుతం జీఎం టాకీస్ కూడలి నుంచి పెట్రోల్‌బంకు కూడలి వరకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయని సంబంధింత అధికారులు పేర్కొంటున్నారు. పగటి పూట ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటుండటంతో కాంట్రాక్టర్ రాత్రి పూట పనులు చేయిస్తున్నారు. కాగా పట్టణ సమీపంలో నున్న సిమెంట్ కర్మాగారాల వాహనాలు కూడా తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. పనులు పూర్తయితే ఇబ్బందులో తొలగిపోతాయి.

ఏటీఎం డిస్‌ప్లే ధ్వంసం



రక్తం కారుతున్న చేతితో ఎస్‌బీఐ ఏటీఎంలో ఆపరేట్ చేస్తున్న దృశ్యం



పగిలిపోయిన యూనియన్ బ్యాంక్ ఏటీఎం డిస్‌ప్లే

డోన్ టౌన్: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో డిస్‌ప్లేని గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేశాడని బ్యాంక్ సిబ్బంది తెలిపారు. సోమవారం సాయంత్రం ఏటీఎంకు వచ్చి నగదు కోసం యత్నించి, వెళ్లే సమయంలో డిస్‌ప్లేను ధ్వంసం చేశాడన్నారు. అక్కడి నుండి రక్తం కారుతున్న చేతితో సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఏటీఎంకు వెళ్లి ఏటీఎంను ఆపరేట్ చేసినట్లు తెలియడంతో స్థానిక స్టేట్ బ్యాంక్‌లో సీసీ ఫుటేజీను పరిశీలించారు. జరిగిన సంఘటనను బ్యాంక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికే నవరత్నాలు



పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కొలిమిగుండ్ల: పేదల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం తిమ్మనాయినపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల గురించి లబ్ధిదారులకు వివరించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలకతీతంగా,అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారని వివరించారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణతో ప్రతిపక్షాలకు ముందుగానే ఓటమి భయం పట్టుకుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, మరోసారి మంచి మనసుతో జగనన్నకు అండగా నిలవాలని కోరారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఎంత మేలు చేశారో ఆ పార్టీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మంచి చేశాం కాబట్టే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని చెప్పారు. పలు కాలనీల్లో స్థానికులు ఇళ్లు,పింఛన్‌లు కావాలని కోరారు. పీర్లచావిడి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని ముస్లింలు కోరడంతో వేయిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు బాబూజీ, మాబాషా, బాసు, సుబ్బయ్య, కుమార్, శేషఫణిస్వామి, నారాయణ, బలరాముడు, శేషయ్య, బాలమల్లయ్య, మదార్, ఓబులేసు, గురుస్వామి పాల్గొన్నారు.

శిబిరాలను వినియోగించుకోండి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయశాఖ అధికారి బషీర్ అహమ్మద్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.

బేతంచెర్ల: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

డోన్ టౌన్ : వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని సృజనాత్మక శక్తిని పెంపొందిచుకోవాలని గ్రంథాలయ అధికారిణి రాధాబాయి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం స్థానిక బాలికల ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థినులకు శిబిరం ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మద్యం మత్తులో ఘర్షణ

డోన్ టౌన్: స్థానిక పాతపేట రైల్వే గేటు సమీపంలో మద్యం మత్తులో ఆదివారం రాత్రి సమీప బంధువులైన బన్నీ, విజయ్, రాజశేఖర్ గొడవపడ్డారు. ఈ క్రమంలో వాదన పెరిగి బన్నీపై విజయ్, రాజశేఖర్ కర్రతో దాడి చేశారు. తలకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొంది బాధితుడు సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట నుంచి అయ్యలచెర్వులోని మదుల వరకు రూ.2.30 కోట్లతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు సోమవారం పరిశీలించారు. పనులు శరవేగంగా జరగడానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చడానికి టౌన్ ఏఈ మహబూబ్ వలీ, కాంట్రాక్టర్ కిశోర్‌తో చర్చించారు.

రిటైర్డు ఉపాధ్యాయుడి మృతి



ఎంసీ రమణ (ఫైల్)

ప్యాపిలి: పట్టణంలో నివాసం ఉంటున్న రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంసీ రమణ (84) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యాయాయ ఉపాధ్యాయుడిగా తుగ్గలి, జొన్నగిరి, హల్వి తదితర ప్రాంతాల్లో సేవలు అందించినప్పటికీ ఎక్కువ కాలం ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో పని చేసి ఇక్కడే స్థిరపడ్డారు. ఆయన మృతికిఉపాధ్యాయ సంఘాలు, పూర్వ విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: స్పందనలో ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని, అందరూ సమన్వయంతో పనిచేసి అర్జిదారుడిని సంతృప్తి పరచాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ శాఖ పరిధిలో వచ్చే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బాధ్యత రహితంగా వ్యహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతి, బిల్లుల మంజూరు, నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎక్కడైనా పంట నష్టం జరిగి ఉంటే రైతుల విజ్ఞప్తి మేరకు నివేదికలు అందజేయాలన్నారు. డీటీ సత్యదీప్, ఏఓ కిరణ్ కుమార్, ఆఓ ఆర్డీ వెంకట రంగనాయకులు, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గజ వాహనంపై విహరించిన పాండురంగడు



గజేంద్రుడిపై పాండురంగడి చిద్విలాసం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు సోమవారం గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వాహన సేవల్లో చివరిదైన గజేంద్ర వాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీ సెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

మాన్యం కౌలుకు వేలం

డోర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామ సిద్ధేశ్వరస్వామి మాన్యం కౌలుకు ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. సిద్ధేశ్వరం ఆలయానికి చెందిన 28ఎకరాల కౌలుకు వేటం నిర్వహించగా రూ.5.81లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.3.55 లక్షలకు పలికిందని ఈఓ తెలిపారు. సర్వే నంబర్ 2, 6కు సంబంధించిన భూముల వేలం వాయిదా వేసినట్లు చెప్పారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



గోరుమానుకొండ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బేతంచెర్ల: మండలంలో పాలిటెక్నిక్ కళశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.33కోట్లు మంజూరు చేసింది. కళాశాల నిర్మాణానికి గోరుమానుకొండ గ్రామ సమీపాన కర్నూలు ప్రధాన రహదారిలో నున్న స్థలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. జిల్లా ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. గతంలో స్థల పరిశీలన జరగగా భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించాలని మంత్రి బుగ్గన ఆదేశాల మేరకు సర్వే నంబర్ 560–ఏ లో 5 ఎకరాలను పరిశీలించారు. స్థలానికి సంబంధించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్డీ రాజేష్, సర్వేయర్ అన్నారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



యువతికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: జీవనోపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రామ్‌కో సిమెంట్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు సూచించారు. కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా కొలిమిగుండ్లలో మూడు నెలల క్రితం ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం సోమవారం పూర్తయ్యింది. టైలరింగ్‌లో శిక్షణ పొందిన కొలిమిగుండ్ల,బెలుం గ్రామాలకు చెందిన 43 మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్, లావణ్య, మహిళా మండలి అధ్యక్షురాలు రోజా రమణి పాల్గొన్నారు.